క్లుప్తంగా

ఆట పరికరాల వితరణ



అబిద్‌నగర్ పార్కులో ఆట పరికరాలను ప్రారంభిస్తున్న అష్మద్ అష్రఫ్

సీతంపేట: ఆస్కి ఫౌండేషన్ ట్రస్టీ అబ్దుల్ అహ్మద్ అష్రఫ్ అబిద్‌నగర్ పార్కుకు స్లైడ్ కమ్ లేడర్‌ను అందజేశారు. పిల్లల ఆట పరికరాలను గురువారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో అబిద్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కిషోర్, ఖాన్, ఎస్‌వీఆర్ ప్రసాద్, ఎన్.ఎస్.మూర్తి, ఎం.వెంకటరావు, పిల్లలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

బాబా ఆలయ హుండీ ఆదాయం రూ.6.53 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఆలయ ఈవో పైలా శేఖర్‌బాబు నేతృత్వంలో జగన్నాథ స్వామి ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీహరి సేవా సంఘం సభ్యులు ఆదాయం లెక్కించారు. 90 రోజులకు గానూ రూ.6.53 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో శేఖర్‌బాబు తెలిపారు. ఆలయ సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి ప్రశ్నాపత్రాల రాక



టెన్త్ ప్రశ్నాపత్రాల బాక్స్‌లకు తాళాలు వేస్తున్న హెచ్‌ఎం రాంప్రసాద్, టీచర్లు

సీతమ్మధార: ఏప్రిల్‌లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు గురువారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరాయి. పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ స్టేషన్‌కు వచ్చి ప్రశ్నాపత్రాల బాక్స్‌లకు తాళాలు వేసి సీల్ చేశారు. అనంతరం వాటిని ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో భద్రపరిచారు. టెన్త్ పరీక్షలకు ముందు ప్రశ్నాపత్రాలు ఓపెన్ చేస్తారు. అంతవరకు పోలీస్‌ల పర్యవేక్షణలో ఉంటాయి.

విద్యార్థిని అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన నాగమల్లేశ్వరి నగరంలోని ఓ కాలేజీలో పాలిటెక్నిక్ చదువుతోంది. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం 7 గంటలకు కళాశాలకు వెళ్లి.. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు కాలేజీలో అడగ్గా.. విద్యార్థిని రాలేదని బదులిచ్చారు. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో నాగమల్లేశ్వరి తల్లి గురువారం సాయంత్రం కంచరపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్(ఏయూ టీడీఆర్ హబ్) ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏయూ టీడీఆర్ హబ్‌లో ప్రవేశం పొంది 18 నెలల కాలం ముగిసిన వారికి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు హబ్ డైరెక్టర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు.

భయపెడుతున్న గెడ్డ ర్యాంప్..!



వాసుదేవనగర్ వైపు మురుగు నీరు, వ్యర్థాలతో పూర్తిగా నిండిపోయిన గెడ్డ

- ప్రమాదకరంగా తాటిచెట్లపాలెం గెడ్డ కల్వర్టు
- ఎక్కువ లోతుతో ర్యాంప్ నిర్మాణం
- పూడిక తీసే యంత్రం తిరగబడే అవకాశం



హైవేపై తాటిచెట్లపాలెం పెట్రోల్ బంక్ పక్కన గెడ్డలో ఎక్కువ లోతుతో నిర్మించిన ర్యాంప్

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారిపై 45వ వార్డు తాటిచెట్లపాలెం పెట్రోల్ బంక్ పక్కన గల గెడ్డలో చెత్త తీసేందుకు నిర్మించిన ర్యాంప్ భయపెడుతోంది. కొన్నేళ్ల పాటు ఈ గెడ్డ రక్షణ గోడలు లేక, హైవేపై రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా ఉండేది. ఈ సమస్య పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతిపాదనలు పెట్టారు. దీంతో గెడ్డకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి, బాటం కాంక్రీట్ వేసేందుకు, ర్యాంప్ నిర్మాణానికి ఇటీవల రూ.11 లక్షలకు కాంట్రాక్టు మంజూరైంది. పనులు కూడా ప్రారంభించారు.

అవి తుదిదశకు చేరుకున్నాయి. అయితే ఇక్కడ నిర్మించిన ర్యాంప్ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ప్రజలకు ఉపయోగకరంగా ఉండాల్సిన పనులు కాస్తా ప్రమాదాలను తెచ్చి పెట్టేలా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు.

గెడ్డలో జారి పడే ప్రమాదం..

తాటిచెట్లపాలెం గెడ్డ అభివృద్ధి పనుల్లో భాగంగా ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించారు. కింది భాగంలో కాంక్రీట్ కూడా వేశారు. ఈ పనులు బాగానే ఉన్నాయి. అయితే గెడ్డను శుభ్రం చేసి పూడికలు తీసేందుకు జేసీబీ, పొక్లెయిన్ యంత్రాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రతి గెడ్డ వద్ద నిర్మించిన మాదిరిగానే ఇక్కడ కూడా ర్యాంప్ నిర్మించారు. దీని పరిస్థితి భయానకంగా ఉంది. ఏటవాలుగా, అతి ఎక్కువ లోతుగా ర్యాంప్ ఉండటంతో దీనిపై రాకపోకలు సాగించేందుకు జేసీబీ, పొక్లెయినర్‌కు అవకాశం లేకుండా పోయింది. దీంతో మళ్లీ దీనిని మార్చి మాన్యువల్‌గానైనా శుభ్రం చేసేందుకు పక్క నుంచి మెట్లు నిర్మించారు. అయినా కూడా ఇది ప్రమాదకరంగానే దర్శనమిస్తోంది. ఏ మాత్రం ఆదమరచినా పాదచారులు, వాహనాలు నేరుగా గెడ్డలో పడే ప్రమాదముంది. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా ఆపాలంటే కనీసం హైవేపై ఎంతో కొంత ఎత్తులో రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం..

ఈ గెడ్డకు మరో వైపు వాసుదేవనగర్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ గెడ్డపై జాతీయ రహదారిలో ఇటు నుంచి అటు వంతెన నిర్మించాల్సిన ప్రాంతంలో పైపులు వేశారు. వాటి వల్ల ఇటువైపు గెడ్డ పూర్తిగా నిండిపోయి, మురుగు నీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా పోయింది. తరచుగా ఇది పూడికలతో నిండిపోవడం, మురుగు నీరు రోడ్లపైకి చేరడం జరుగుతోంది. ప్రస్తుతం ఈ గెడ్డ పూడికతో పూర్తిగా నిండిపోయింది. ఈ చెత్త ఎప్పుడు హైవేపై ప్రవహిస్తుందో తెలియని పరిస్థితి. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ గెడ్డ నీరు కిందికి పోయేలా ఏర్పాటు చేయాలని, వాసుదేవనగర్ వైపు గెడ్డలో నిండిన పూడికను తొలగించాలని, ర్యాంప్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేత్రపర్వంగా భావనారుషి కల్యాణం



కల్యాణంలో సుమూహుర్త ఘట్టం నిర్వహిస్తున్న గురుస్వామి



భద్రావతి, భావనారుషి స్వామిల కల్యాణంలో పాల్గొన్న పద్మశాలి దంపతులు

సీతంపేట: పద్మశాలీల కులదైవం, సృష్టికే వస్త్ర నిర్మాణ ప్రదాతైన భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం సీతంపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక దుర్గాగణపతి ఆలయం వెనుక వీధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది పద్మశాలి దంపతులు కల్యాణాన్ని తిలకించి తరించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆమంచి ఆంజనేయ గురుస్వామి మంత్రోచ్ఛారణల నడుమ స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. సుమూహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. కల్యాణంలో ప్రతి ఘట్టం విశిష్టత, అందులో దాగి ఉన్న అంతర్యాలను భక్తులకు వివరించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలిచ్చిన పద్మశాలి కులస్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు.

5 వేల మందికి అన్నదానం..

ఈ సందర్భంగా సుమారు 5 వేల మంది ప్రజలకు అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాలతో సీతంపేట పురవీధుల్లో భద్రావతి సమేత భావనారుషి స్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి హారతులిచ్చి స్వామికి నీరాజనాలు సమర్పించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ స్వామివారిని దర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుదే రాజు, ఉపాధ్యక్షుడు బేత అప్పాజీ, కార్యదర్శి వానపల్లి లక్ష్మణ్‌కుమార్, కోశాధికారి దొడ్డి వాసు, పద్మశాలి కుల పెద్దలు పాల్గొన్నారు.

సమాచారమ్

27న మార్కెట్లకు వేలంపాట

జగదాంబ: సూర్యాబాగ్‌లోని జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో ఈ నెల 27న వివిధ మార్కెట్లకు సంబంధించి వేలం పాట నిర్వహిస్తున్నట్టు జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధి 12 వార్డుల్లో ఉన్న మార్కెట్లు, జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, పార్కుల ప్రవేశ రుసుములు, చెట్ల ఫలసాయానికి సంబంధించి ఈ ఏడాది మార్చి 1 నుంచి 2024 మార్చి 31 వరకు గుత్తేదారుకు ఇచ్చే విషయమై వేలం వేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఆసక్తి గల వారు 27న ఉదయం 11 గంటలకు జోన్-4 కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

స్ఫూర్తిప్రదాత పిళ్లా రామారావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

సీతంపేట: విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు పిళ్లా రామారావు సంస్మరణ సభ గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ శాంతం, దరహాసం, ఓర్పు, సహనం, వినయం గల మహామనిషి అని కొనియాడారు. ప్రముఖ విద్యావేత్తగా, సేవా ప్రముఖుడిగా వినతికెక్కిన వ్యక్తిని, ఎందరికో రామారావు స్ఫూర్తినిచ్చారని ప్రశంసించారు. ఏవీఎన్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిగా రామారావు వద్ద భౌతిక శాస్త్రం నేర్చుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. సభాధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్ దాస్, ప్రయాగ మురళీమోహన్, ఏవీఎన్ శెట్టి, ఆచార్య పి.సోమరాజు, రచయిత డి.వి.సూర్యారావు, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, తదితరులు పిళ్లా రామారావుతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిళ్లా రమణమూర్తి, డాక్టర్ జి.ప్రభాకర్, ద్వారం త్యాగరాజు శిష్య బృందం పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధి మర్రిపాలెం 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహారాణి వీధి, మర్రిపాలెం ప్రధాన రహదారి, రాణాప్రతాప్ నగర్, గ్రీన్ గార్డెన్స్, గౌతమి గార్డెన్స్, రామన్ స్కూల్ ఏరియా డౌన్, జ్యోతినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

సీతమ్మధారలో..

సీతమ్మధార: సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో నిర్వహణా పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఎంఎంటీసీ కాలనీ 33/11 కేవీ ఫీడర్ పరిధిలో సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంతం, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, అచూరి పోర్టు ఏరియా, ఎల్‌ఐసీ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ధ్యాన మందిరంలో భారీ అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు, పేదలు



షిర్డీసాయికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో అన్నదానం ప్రారంభించి 13 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వార్షికోత్సవం, శ్రీరామ నవమి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 6 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, సాయిబాబాకు ప్రత్యేక క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం జరిపారు. మధ్యాహ్నం హారతి అనంతరం దాతలు డాక్టర్ కాండ్రేగుల అనిల్‌కుమార్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారాలతో భక్తులు, పేదలకు ప్రత్యేక అన్నదానం చేశారు. అనంతరం వెజిటబుల్ బిర్యాని, కూర, సాంబార్ ప్యాకెట్లను ధ్యాన మందిరంలోని కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లో భద్రపరిచారు. సాయంత్రం సంధ్యాహారతి సమర్పించిన అనంతరం మహిళా భక్తుల పల్లకీ సేవ, సహస్ర పుష్పార్చన, సాయిబాబా గీతాలాపన వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు, సాయి సేవకులు సహకరించారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. రూ.500 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులను ఈ ప్రత్యేక పూజకు అనుమతించనున్నారు. వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

బీసీల సభ జయప్రదానికి పిలుపు



సంఘీభావం తెలుపుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సీతంపేట: బీసీల డిమాండ్ల సాధనకు ఈ నెల 25న రాజమహేంద్రవరంలో తలపెట్టిన 'హలో బీసీ-ఛలో రాజమహేంద్రవరం' సభను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జన గణనలో కుల గణన జరగాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, పార్లమెంట్‌లో బీసీల మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. ఉద్యోగులకు పదోన్నతులు, రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పాల్గొని బీసీల సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. ఈ ఐదు డిమాండ్ల సాధనకు రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద శ్రీవెంకటేశ్వర ఆనం కళాక్షేత్రంలో జరిగే సభకు బీసీలందరూ హాజరై విజయవంతం చేయాలని నరేష్ యాదవ్ కోరారు. సమావేశంలో రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ పిళ్లా నివాస్, రాష్ట్ర ప్రచార కమిటీ ఇన్‌చార్జి పిళ్ల దినేష్‌కృష్ణ, రాష్ట్ర స్టూడెంట్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి చిన్ని కిషోర్ యాదవ్, జిల్లా మహిళాధ్యక్షురాలు సత్యలత, నరేష్, కలపర్తి లక్ష్మి, ఆన చంద్రప్రసాద్ తదితరులు సంఘీభావం తెలిపారు.

5న 'చలో ఢిల్లీ'



చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అల్లిపురం: మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ(కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీ) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, కె.ఎం.కుమార్ మంగళం, పి.మణి, కార్యదర్శి బి.జగన్‌తో కలిసి ఆయన చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీ వంటి వారి సేవలో మోదీ సర్కారు మునిగి తేలుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాల్లో మార్పులు చేసి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్‌లపై పన్నులు పెంచి ఏడాదికి మూడున్నర లక్షల కోట్ల భారం ప్రజలపై మోపుతున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న లక్షలాది మందితో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ విధానాలను ఓడించేలా ఈ ఉద్యమం సాగుతుందని పేర్కొన్నారు.

దొమ్మేటి వెంకటరెడ్డికి ఘన నివాళి



వెంకటరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని శెట్టిబలిజ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడిగా ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. శెట్టిబలిజ నామకరణం చేసి వందేళ్లు పూర్తయ్యిందన్నారు. సంఘ ప్రెసిడెంట్ గుత్తల మధు, సెక్రటరీ పిల్లి యరాం, కట్టా మల్లేశ్వరరావు, కడలి సుబ్బారావు, వి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలపై ప్రత్యేక డ్రైవ్



ఎన్‌ఏడీ జంక్షన్‌లో ఆటోను పరిశీలిస్తున్న సీఐ అప్పారావు

గోపాలపట్నం: ఆటోలపై ఉన్న పెండింగ్ చలానాలు వసూలు చేసేందుకు ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఎన్‌ఏడీ జంక్షన్ దిగువ సర్కిల్ వద్ద ఆటోలను ఆపి ఎన్ని జరిమానాలు పెండింగ్ ఉన్నదీ.. అవి ఎంత అని పరిశీలించి వసూలు చేసే ప్రక్రియ చేపట్టారు. ఈ విధమైన తనిఖీలు ప్రతి రోజూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇంత వరకు ఈ ఫైన్లపై ఉదాసీనంగా ఉన్న పోలీసులు ఇప్పుడు ఉక్కుపాదం మోపారు. భారీ స్థాయిలో ఈ ఫైన్లు ఉంటాయని ఆటో డ్రైవర్లే చెబుతుండటం విశేషం.

అప్పన్నకు శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ఉప ప్రధానార్చకుడు, ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళిని నిర్వహించారు.

పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈసేవను నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు శ్రీ వరాహ నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమంపడంలోని వేదికపై వేంజేంప జేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు ,ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా గరుడ సేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేంపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజను నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఈపూజలో పాల్గొన్నారు.

లలితా పీఠంలో రాజశ్యామల హోమం

సీతంపేట: వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం లలితానగర్ లలితా పీఠంలో పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా రాజశ్యామల హోమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు షోడశ మహామంత్ర హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న గిరిజన పూజారులు



సింహగిరిపై గిరిజన పూజారులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం అల్లూరి సీతారామారాజు జిల్లాకు చెందిన పలువురు గిరిజన పూజారులు దర్శించుకున్నారు. అక్కడ పలు గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి ఆలయాల్లో వీరంతా పూజారులుగా ఉన్నారు. అల్లూరి జిల్లాలోని టీటీడీ నిర్మిస్తున్న 163 ఆలయాల్లో కూడా వీరంతా పూజారులుగా విధులు నిర్వహించనున్నారు. ఈ తరుణంలోనే గురువారం భీమిలిలో జరిగిన ఒక సమావేశానికి వచ్చిన వీరంతా తొలుత అప్పన్నను దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈఈ, అల్లూరి జిల్లాలోని ఆలయాల నిర్మాణాల పర్యవేక్షకుడు రాంబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి ఏర్పాట్లు పర్యవేక్షించారు.